సాక్షి
తిరుపతి
శుక్రవారం । 11 । ఆగస్టు । 2023



భూసార పరీక్షలు తప్పనిసరి

అధిక దిగుబడికి భూసార పరీక్షలు తప్పనిసరి అని జువారీ జైకిసాన్ ఫామ్ జనరల్ మేనేజర్ డాక్టర్ కేకే సింగ్ సూచించారు. - 8లో



టూరిజం పనులు వేగవంతం

అరణియార్ టూరిజం పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అధికారులను ఆదేశించారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	32	24
చిత్తూరు	32	24
తిరుమల	28	21
గూడూరు	35	27
నగరి	34	26

న్యూస్‌రీల్

'నులిమేద్దాం'!



ఆల్‌బెండజోల్ మాత్రలు వేస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్

తిరుపతి అర్బన్: జాతీయ నులిపురుగుల నిర్మూలనా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ డీకే బాలాజీ పిలుపునిచ్చారు. గురువారం తిరుపతిలోని బైరాగిపట్టెడ ఎంజీఎం హైస్కూల్‌లో జాతీయ నులిపురుగుల నిర్మూలనా కార్యక్రమం (నేషనల్ డీ వార్మింగ్ డే)లో భాగంగా అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లలు నులిపురుగుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 3–19 సంవత్సరాల పిల్లలు, కిశోర బాలబాలికలకు 400 ఎంజీ మాత్రలు, 1– 2 సంవత్సరాల పిల్లలకు సగం మాత్రను భోజనం తరువాత మింగించాలని సూచించారు. జిల్లాలో మొత్తంగా 4,84,612 మంది పిల్లలు ఉన్నారని, వాళ్లందరికీ డీవార్మింగ్ మాత్రలు పంపిణీ చేయాలని చెప్పారు. డీఎంహెచ్‌ఓ శ్రీహరి, డీఈఓ వీ.శేఖర్, అడిషనల్ డీఎంహెచ్‌ఓ అరుణసులోచనాదేవి, డీఐఓ శాంత కుమారి, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం ఆఫీసర్ హరినాథ్, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ అన్వేష్‌రెడ్డి, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

గడువు లోపు సర్వే పూర్తిచేయండి

తిరుపతి అర్బన్: గడువులోపు భూ సర్వే పూర్తిచేయాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ డీకే బాలాజీ సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆయన సర్వే అధికారులతో సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆగస్టు 31వ తేదీ రెండో దశ భూ సర్వే పనులు పూర్తి చేయాలని, ఇప్పటికే మొదటి దశ సర్వే పూర్తయిన ప్రాంతాల్లో సరిహద్దు రాళ్లు నాటాలని చెప్పారు. రెండో దశకు సంబంధించి 141 గ్రామాలకుగాను 80 గ్రామాల్లో మాత్రమే సర్వే పూర్తయిందన్నారు. మిగిలిన గ్రామాల్లో ఈ నెల 31లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. సమీక్షలో సర్వే జిల్లా అధికారి జయరాజ్ ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్: గ్రామ, వార్డుల పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టులను భర్తీ చేయడానికి ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు నోటిఫికేషన్ ఇవ్వాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ డీకే బాలాజీ గురువారం స్పష్టం చేశారు. ఈనెల 11 నుంచి 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల నమోదు, 22న ఎంపిక, 23న విధులు అప్పగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

నైపుణ్యాభివృద్ధి శిక్షణకు దరఖాస్తులు

రేణిగుంట: అమరరాజ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో 32వ బ్యాచ్ అడ్మిషన్లు జరుగుతున్నట్లు సెంటర్ ప్రతినిధులు గురువారం తెలిపారు. చిత్తూరు జిల్లా, పూతలపట్టు మండలం, పేటమిట్టలో ఉన్న కేంద్రంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. టెన్త్, ఇంటర్ పాస్, ఫెయిల్ అయిన నిరుద్యోగ యువతీ, యువకులు ఈనెల 17వ తేదీ ఉదయం 10 గంటలకు నేరుగా పేటమిట్టలోని కేంద్రానికి తమ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు 9000024919, 9100477371 నంబర్లలో సంప్రదించొచ్చని సూచించారు.

ప్రశాంతం.. నామినేషన్ల పర్వం

తిరుపతి అర్బన్: జిల్లాలో ఈనెల 19న జరగనున్న సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ గురువారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా ఐదు సర్పంచ్, 41 వార్డులకు ఎన్నికలు ఎన్నికలు జరగనుండగా.. సర్పంచ్ స్థానాలకు 17, వార్డు సభ్యులకు 80 నామినేషన్లు దాఖలైనట్టు జిల్లా పంచాయతీ అధికారి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. 12, 13 తేదీల్లో ఫిర్యాదుల స్వీకరణ, 14న నామినేషన్ల ఉపసంహరణ, తుది జాబితా ప్రకటిస్తామన్నారు. అనంతరం 19వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆ మేరకు పటిష్ట ఏర్పాట్లు చేపట్టినట్టు పేర్కొన్నారు.

పులికాట్‌లో మూడు గంటలు నరకం

తడ: పులికాట్ సరస్సు మధ్యలో వలలకు చిక్కుకుని ఓ పడవ నిలిచిపోయింది. అందులోని విద్యార్థులు సుమారు మూడు గంటల పాటు నరకం అనుభవించిన ఘటన గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలు.. ఇరకం విద్యార్థులు పడవలో పళవేర్కాడుకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుంటారు. ఈ తరుణంలో పడవకు వలలు తగులుకుని సరస్సు మధ్యలో నిలిచిపోయింది. సాయంత్రం 5 గంటలకు ఇళ్లకు రావాల్సిన పిల్లలు ఎంతకీ రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు మరో పడవలో బయలుదేరి వలల మధ్యలో చిక్కుకున్న పడవను రాత్రి 8 గంటల సమయంలో విడిపించారు. ఆపై విద్యార్థులను గ్రామానికి తీసుకు వచ్చారు.

ప్రమాణం.. ప్రణామం!



స్వామిని స్మరించుకుంటున్న టీటీడీ చైర్మన్ భూమన

- అట్టహాసంగా టీటీడీ చైర్మన్ భూమన ప్రమాణ స్వీకారం
- ముందుగా శ్రీవారి చెల్లెలు గంగమ్మకు పూజలు
- అనంతరం తిరుమలకు పయనం
- సంప్రదాయానికి పెద్దపీట వేసిన నూతన చైర్మన్

సాక్షి, తిరుపతి: హైందవ సంప్రదాయాన్ని వెలుగెత్తి చాటుతూ.. సనాతన హిందూ ధర్మాన్ని తూచా తప్పక పాటిస్తూ.. సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ.. టీటీడీ నూతన చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి గురువారం అట్టహాసంగా ప్రమాణ స్వీకారం చేశారు. ముందుగా తిరుపతి పద్మావతీపురంలోని తన నివాసంలో ఉదయం టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి, ఆలయ ప్రధాన అర్చకుల బృందం వేద ఆశీర్వచనాలు అందించగా.. భూమన సంప్రదాయ దుస్తులతో కుటుంబ సమేతంగా శ్రీవారి చెల్లెలు, తిరుపతి తాతయ్యగుంట గంగమ్మను దర్శించుకున్నారు. విశేష పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అక్కడి నుంచి అలిపిరి గోశాలకు చేరుకుని శ్రీకృష్ణునికి, గోమాతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత అలిపిరి పాదాల మండపానికి చేరుకున్న భూమన దంపతులు స్వామివారి పాదుకలను తలపై ఉంచుకుని ఆలయ ప్రదక్షిణ చేశారు. నుదుట తిరునామం.. సరిగంచు పంచె.. ఉత్తరీయం ధరించి సంప్రదాయబద్ధంగా స్వామి సేవకు కుటుంబ సభ్యులతో కలిసి సప్తగిరులను అధిరోహించారు. ముందుగా వరాహస్వామిని దర్శించుకుని అనుగ్రహం పొందారు. ఆపై వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నుంచి ఆలయంలోకి ప్రవేశించారు. ఈఓ ధర్మారెడ్డి, అర్చకులు అపూర్వ స్వాగతం పలకగా.. భూమన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కారు. తర్వాత గరుడాళ్వార్ సన్నిధిలో టీటీడీ చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం శ్రీవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. రంగనాయకుని మండపంలో టీటీడీ నూతన చైర్మన్ భూమన దంపతులకు పండితులు వేద ఆశీర్వాదం అందించగా.. ఈఓ స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఆర్‌కే.రోజా, అంబటి రాంబాబు, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి, కమిషనర్ హరిత తదితరులు పాల్గొన్నారు.



ధ్వజస్తంభానికి మొక్కుతున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి



టీటీడీ చైర్మన్‌కు వేదపండితుల ఆశీర్వాదం



ధ్వజస్తంభం వద్ద టీటీడీ చైర్మన్ భూమన, మంత్రి ఆర్కే రోజా



స్వామివారి పాదుకలను తలపై పెట్టుకుని ప్రదక్షిణ చేస్తున్న టీటీడీ చైర్మన్ భూమన దంపతులు



తిరుపతి తాతయ్యగుంట గంగమ్మను దర్శించుకుంటున్న టీటీడీ చైర్మన్ భూమన



కుటుంబ సమేతంగా గోపూజ నిర్వహిస్తున్న టీటీడీ చైర్మన్ దంపతులు



టీటీడీ చైర్మన్ భూమన, ప్రభుత్వ విప్ చెవిరెడ్డికి స్వాగతం పలుకుతున్న ఈఓ ఏవీ ధర్మారెడ్డి

నేడు భూమి పూజ

తిరుమల: తిరుమలలోని ఎస్వీ మ్యూజియం ఆధునికీకరణ పనులకు శుక్రవారం ఉదయం 8.30 గంటలకు భూమి పూజ నిర్వహించనున్నారు. కార్యక్రమానికి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ధర్మారెడ్డి హాజరుకానున్నట్టు సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

ఎన్జీ రంగా వర్సిటీ పాలక మండలిలో ప్రాధాన్యం



తిరుపతి సిటీ : ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పాలక మండలి నియామకంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ప్రాధాన్యత లభించింది. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో 1980–84లో బీఎస్సీ అగ్రికల్చర్, పీజీ (ప్లాంట్ పెథాలజీ) పూర్తి చేసిన పూర్వవిద్యార్థి డాక్టర్ బాసిరెడ్డి శ్రీనివాసులురెడ్డికి వ్యవసాయ పరిశ్రమల విభాగంలో సభ్యత్వం లభించింది. అన్నమయ్య జిల్లా, గుర్రంకొండ మండలం, దిగువ బురుజుపల్లెకు చెందిన ఆయన వ్యవసాయరంగ పారిశ్రామికవేత్తగా వ్యవహరించారు. పరిశోధక సహాయకులుగా పనిచేసిన ఆయన 32 సంవత్సరాల పాటు విత్తనోత్పత్తి సంస్థల్లో పనిచేశారు. స్వచ్ఛంద పదవీ విరమణ చేసి ప్రస్తుతం వివిధ విత్తనోత్పత్తి సంస్థలకు సలహాదారుగా పనిచేస్తున్నారు. అదేవిధంగా అకడమిక్ కౌన్సిల్ సభ్యుల కోటాలో తిరుపతిలోని అగ్రి బిజినెస్ మేనేజ్మెంట్ స్కూల్ డైరెక్టర్ డాక్టర్ పవీ.సత్యగోపాల్‌కు పాలకమండలిలో చోటులభించింది. తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం మృత్తికాశాస్త్రం శాస్త్రవేత్త డాక్టర్ వెంకటరామ్‌మునిరెడ్డి ప్రస్తుతం డిప్యూటేషన్లో పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేకాధికారిగా పనిచేస్తున్నారు. పాలకమండలిలో ప్రత్యేకాధికారికి సభ్యత్వం ఉండడంతో ఆయన సభ్యులుగా పనిచేయనున్నారు. పాలకమండలి సభ్యులుగా ఎంపికైనవారికి అసోసియేట్ డీన్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, అధ్యాపకులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

వడ్డీ మాఫీ.. హ్యాపీ

'మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలి. వారి కాళ్లపై వారు నిలబడాలి. అప్పుడే ఆ కుటుంబం..రాష్ట్రం.. దేశం బాగుంటుంది'అని బలంగా నమ్మిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ప్రభుత్వంలో నారీమణులకు అగ్రతాంబూలం వేశారు. చట్టసభల నుంచి.. సంక్షేమ పథకాల్లోనూ వారికి సముచిత స్థానం కల్పించారు. నాడు ప్రజాసంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా రుణాలు విడతల వారీగా మాఫీ చేస్తున్నారు. బ్యాంక్ లింకేజీ రుణాలకు వడ్డీని సైతం కంతుల వారీగా మాఫీ చేస్తూ ఆర్థిక భరోసా కల్పిస్తున్నారు. ఇప్పటికే వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద మూడు విడతలుగా వడ్డీని మాఫీ చేశారు. నేడు నాలుగో విడత మొత్తాన్ని మాఫీ చేయనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. దీనిపై అక్కచెల్లెమ్మలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- నేడు స్వయం సహాయక సంఘాల సభ్యుల వడ్డీ మాఫీ
- ఇప్పటికే మూడు విడతల్లో మాఫీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- నాల్గో విడతలో మరింత మందికి భరోసా
- హర్షం వ్యక్తంచేస్తున్న అక్కచెల్లెమ్మలు



దక్కిలి మండలం, చాపలపల్లిలో స్వయం సహాయక సంఘాల సభ్యుల సమావేశం

జిల్లా సమాచారం

స్వయం సహాయక సంఘాలు	సభ్యులు
36,973	4,35,770

మాఫీ కానున్న వడ్డీ
54.81 కోట్లు

దక్కిలి: రాష్ట్ర ప్రభుత్వం అక్కచెల్లెమ్మలకు అండగా నిలుస్తోంది. వారు ఆర్థికంగా నిలదొక్కుకోవాలని సర్వశక్తులూ ఒడ్డుతోంది. ఇందులో భాగంగానే వారి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టింది. ప్రధానంగా ఆసరా, చేయూత, కాపునేస్తం, ఈబీసీ నేస్తం, సున్నావడ్డీ, అమ్మ ఒడి వంటి పథకాల ద్వారా ఆర్థిక సహకారం అందిస్తోంది. డ్వాక్రా మహిళలు బ్యాంకుల్లో తీసుకున్న బ్యాంక్ లింకేజీ రుణాలను క్రమం తప్పకుండా చెల్లించిన వారికి వైఎస్సార్ సున్నావడ్డీ పథకం ద్వారా పూర్తివడ్డీని ప్రభుత్వం మాఫీ చేస్తోంది. ఇప్పటికే మూడు విడతలు వైఎస్సార్ సున్నావడ్డీ పథకంలో నిధులు అందజేసిన ప్రభుత్వం నాలుగో విడత నిధులు జమచేసేదిశగా అడుగులు వేస్తోంది. ఈ కార్యక్రమం జూన్ 26న కోనసీమ జిల్లా అమలాపురంలో అమలు కావాల్సి ఉండగా.. భారీ వర్షాలు.. వరదల కారణంగా కొంత ఆలస్యమైంది. నేడు అదే ప్రాంతం నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిధులు విడుదల చేయనున్నారు.

తిరుపతి జిల్లాలో ఇలా..

తిరుపతి జిల్లాలో 34 మండలాల్లో వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద 36,973 స్వయం సహాయక సంఘాలకు చెందిన 4,35,770 మంది సభ్యులకు రూ.54.81 కోట్ల మేర జమకానుంది. 2022 ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు చెల్లించిన బ్యాంక్ రుణాలకు సంబంధించి వడ్డీ రాయితీని ప్రభుత్వం అందించనుంది. రూరల్ పరిధిలో 27,524 సంఘాలకు సంబంధించి 3,30,093 మంది సభ్యులు ఉండగా.. రూ.37.74 కోట్లు జమకానుంది. అలాగే అర్బన్ పరిధిలో 9,449 సంఘాలుండగా 1,05,677 సభ్యులకు రూ.17.07కోట్లు జమకానుంది.

జగనన్నకు రుణపడి ఉంటాం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా సంఘాలకు వడ్డీ రాయితీ అందిస్తున్నారు. ఇప్పటికే మూడు విడతలుగా సున్నా వడ్డీ పథకం కింద డబ్బులు తీసుకున్నాం. త్వరలో నాల్గో విడత సున్నా వడ్డీ మొత్తాన్ని ఇస్తామని చెబుతున్నారు. చాలా సంతోషంగా ఉంది. సీఎం జగనన్నకి రుణపడి ఉంటాం.

– సురేఖ, చాలపపల్లి, వీఓఏ

సాయం మరువలేనిది



పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలను సీఎం జగనన్న నిలబెట్టుకుంటున్నారు. మహిళలకు అందిస్తున్న సహకారం మరవలేనిది. బ్యాంక్ లింకేజీ రుణాలు, స్త్రీనిధి, ఆసరా, అమ్మ ఒడి, సున్నావడ్డీ పథకాల ద్వారా అందిస్తున్న చేయూతతో ఆర్థికంగా నిలదొక్కుకోగలుగుతున్నాం.

– సుమతి, డ్వాక్రా మహిళ, అంబేద్కర్‌నగర్

ఏ ప్రభుత్వాలూ ఇలా అమలు చేయలేదు



గతంలో అప్పులు తీసుకుని వడ్డీలు, అసలు కట్టలేక అవస్థలు పడ్డాం. పొదుపులో రుణాలు తీసుకుంటే ఏటా వడ్డీతో కలిసి అసలు కొండంత కట్టాల్సి వచ్చేది. ఇప్పుడు ఈ పరిస్థితి లేదు. సీఎం జగనన్న ఎప్పటికప్పుడు వడ్డీ మాఫీ చేస్తుండడంతో అప్పు సులభంగా తీరిపోతోంది.

– లక్ష్మి, వీఓఏ, పాతనాలపాడు

మహిళల పురోగతికి దోహదం



డ్వాక్రా మహిళలకు గత మూడు దఫాలుగా సున్నావడ్డీ నగదును ప్రభుత్వం అందజేసింది. మహిళలు వడ్డీ లేకుండా బ్యాంక్ రుణాలు తీసుకుని పురోగతి సాధిస్తున్నారు. ఏటా సున్నా వడ్డీ అందిచడంతో మహిళల ఆర్థికంగా నిలదొక్కుకోగలుగుతున్నారు. మహిళలందరూ వడ్డీ నిధులు సద్వినియోగం చేసుకోవాలి.

– పోలమ్మ, ఏపీఎం, దక్కిలి

తెప్పపై కనువిందు



తెప్పపై విహరిస్తున్న శ్రీవళ్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి

శ్రీకాళహస్తి: ఆడికృత్తిక ఉత్సవాల్లో భాగంగా గురువారం కుమారస్వామి తెప్పపై విహరిస్తూ కనువిందు చేశారు. మొదట స్వామి, అమ్మవార్ల అలంకరణలు చేపట్టారు. మంగళవాయిద్యాలు, మేళతాళాలు, వేదమంత్రాల నడుమ నారదపుష్కరణి వద్దకు వేంచేపు చేశారు. అక్కడ సిద్ధం చేసిన తెప్పలై స్వామి, అమ్మవార్లు ఆశీనులై పుష్కరిణిలో ఊరేగుతూ భక్తులను ఆకట్టుకున్నారు. ఉదయం రథోత్సవం కనుల పండువగా సాగింది. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ ఆదర్శం



తాగునీటి ట్యాంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నారాయణవనం: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ ఆదర్శమని జీబీసీ చెన్నై డైరెక్టర్ పాల్ రంఘునాథన్ అన్నారు. మండలంలోని కసిమిట్ట పంచాయతీ జగనన్న కాలనీలో జీబీసీ ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన తాగునీటి వసతిని గురువారం సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంతో కలిసి ఆయన ప్రారంభించారు. సుమారు రెండు లక్షల వ్యయంతో గొట్టపు బావిని తవ్వించి బోరు మోటారు, ట్యాంకును ఏర్పాటు చేశారు. అనంతరం భీమునిచెరువులోని సచివాలయాన్ని, రైతు భరోసా కేంద్రాన్ని, వెల్‌నెస్‌సెంటర్, గ్రంథాలయ భవనాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్‌లు శశికళ, మురుగేశం, ఎంపీడీఓ గుణశేఖర్, ఎంఈఓలు ప్రభాకర్‌రాజు పాల్గొన్నారు.

మారణహోమమే లక్ష్యం

- పుంగనూరు ఘటనను తీవ్రంగా ఖండించిన ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు



మాట్లాడుతున్న గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరు రూరల్: ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన చంద్రబాబు రాష్ట్రంలో మారణహోమాన్ని సృష్టించి లబ్ధి పొందేందుకు కుటిల యత్నాలు చేస్తున్నారని, దీన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున తాము తీవ్రంగా ఖండిస్తున్నామని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు తెలిపారు. గూడూరులోని ఎమ్మెల్యే నివాసంలో గురువారం ఆయన విలేకరుతో మాట్లాడారు. చంద్రబాబు చేసేది ప్రాజెక్టుల సందర్శనా.. లేక హింసకు పథక రచనా..? అని ప్రశ్నించారు. స్థానిక కార్యకర్తలు కాకుండా బెంగళూరు, చెన్నై, పక్క జిల్లాల నుంచి పుంగనూరు, అంగళ్లకు ఎందుకు రప్పించారని నిలదీశారు. అధికారికంగా ఇచ్చిన రూట్ మ్యాప్ ప్రకారం కాకుండా పుంగనూరు వెళ్లి విధ్వంసం సృష్టించాలన్నదే చంద్రబాబు లక్ష్యమన్నారు. వై జంక్షన్ వద్ద వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు లేరని, గొడవలు జరిగే వాతావరణం లేకున్నా చంద్రబాబు తన కార్యకర్తలను రెచ్చగొట్టింది విధ్వసం సృష్టించారని తెలిపారు. పోలీసులను లక్ష్యంగా చేసుకుని ముందుగానే రాళ్ల దాడి ఎందుకు ప్రారంభించారని ప్రశ్నించారు. వాహనాలు తగుల బెట్టి, పోలీసులను తీవ్రంగా గాయపరచడం వెనుక చంద్రబాబు ఉద్దేశం ఏమిటో ప్రజలకు ఇప్పటికే అర్థమైందన్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బత్తిని విజయకుమార్ మాట్లాడుతూ పుంగనూరు ఘటన చాలా బాధాకరమన్నారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ ఓడూరు యమునమ్మ, గూడూరు ఎంపీపీ బూదూరు గురవయ్య, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాసులు, చిల్లకూరు మండల కన్వీనర్ పరంధామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రాఘవరెడ్డి, నాయకులు శ్రీకిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, దేగపూడి కృష్ణారెడ్డి, జనార్దన్‌రెడ్డి, అల్తాఫ్, సుభాన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రీవారి హుండీలో చోరీ చేసిన వ్యక్తికి జైలు

తిరుపతి లీగల్: తిరుమల శ్రీవారి హుండీలో సొమ్మును అపహరించిన కేసులో కర్నూలు జిల్లా, కోసిగి మండలం, జంపాపురానికి చెందిన జీ.రామకృష్ణ అలియాస్ ఆనంద్‌కు రెండు నెలల జైలు శిక్ష, రూ.100 జరిమానా విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు గురువారం తీర్పు చెప్పారు. గత నెల 15వ తేదీ తిరుమల శ్రీవారి ఆలయంలోని కొత్త హుండీలో నిందితుడు రామకృష్ణ రూ.5,600 అపహరించాడు. సీసీ కెమెరాల ద్వారా గుర్తించిన సిబ్బంది అతన్ని అదుపులోకి తీసుకున్నారు. టీటీడీ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ మహేష్ తిరుమల ఒన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేసి నిందితుడు రామకృష్ణను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా.. న్యాయమూర్తి అతనికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 16 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 75,594 మంది స్వామివారిని దర్శించుకోగా.. 26,213 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.69 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా, దర్శన టికెట్లు లేని భక్తులకు 15 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

అభినందనల వెల్లువ



టీటీడీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన భూమన కరుణాకర రెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలుపుతున్న మంత్రి ఆర్కే.రోజా, టీటీడీ చైర్మన్‌ను ఆత్మీయంగా ఆలింగనం చేసుకుంటున్న ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, టీటీడీ ఈఓ ఏవీ.ధర్మారెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు - తిరుమల

అరణియార్ టూరిజం పనులు
వేగవంతం చేయండి

- ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు
- పనులను పరిశీలించిన ఎమ్మెల్యే, తుడా వీసీ



అరణియార్ వద్ద టూరిజం పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం, తుడా వీసీ హరిక్రిష్ణ

పిచ్చాటూరు: అరణియార్ టూరిజం పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, తుడా వీసీ హరిక్రిష్ణ ఇరిగేషన్ అధికారులకు సూచించారు. గురువారం మధ్యాహ్నం అరణియార్ వద్ద తుడా నిధులు రూ.1.82 కోట్లతో చేపడుతున్న మొదటి విడత టూరిజం పనులను ఎమ్మెల్యే, తుడా వీసీ, ఇరిగేషన్ ఈఈ మదనగోపాల్ పరిశీలించారు. మొదటి విడతలో 1.89 ఎకరాల్లో చేపడుతున్న వ్యూటవర్, బోటింగ్ జట్టీ, 4 బోట్లు, చిల్డ్రన్స్ పార్క్, మరుగుదొడ్లు, రేటైనింగ్ వాల్ పనులు పురోగతిని గురించి అడిగి తెలుసుకున్నారు. పనులు వేగవంతం చేయాలని వీసీ హరిక్రిష్ణ ఇరిగేషన్ అధికారులకు సూచించారు.

రెండో దశ పనులకు ప్రతిపాదనలివ్వండి

రెండవ దశలో చేపట్టనున్న పనులకు ప్రతిపాదనలు ఇస్తే నిధులు మంజూరు చేయడానికి సిద్ధంగా ఉన్నామని తుడా వీసీ హరిక్రిష్ణ తెలిపారు. రెండో దశలో 0.81 ఎకరాల్లో రూ.3 కోట్లకు ఎంట్రన్స్ ప్లాజా, ఫుడ్ కోర్ట్, కాటేజీలు నిర్మాణం, వెహికల్ పార్కింగ్ ఏరియా, గార్డెన్, లాండ్ స్కేపింగ్, ఫౌంటైన్ పనులు చేపట్టడానికి ప్రతిపాదించామని ఈఈ మదనగోపాల్ తెలిపారు. ఈ పనులకు సంబంధించి ఒకటి, రెండు రోజుల్లో తుడా కార్యాలయానికి ప్రతిపాదనలు సమర్పిస్తామని ఇరిగేషన్ ఈఈ వెల్లడించారు.

అరణియార్ పర్యాటకానికి పూర్వ వైభవం: ఎమ్మెల్యే

టూరిజం పనులు పూర్తి అయితే అరణియార్ పర్యాటకానికి పూర్వ వైభవం వస్తుందని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మించిన అప్పటి ఉమ్మడి మద్రాసు ప్రభుత్వం పర్యటకాన్ని సుందరాంగంగా తీర్చిదిద్దడంతో అప్పట్లో చాలా సినిమాలు, టీవీ సీరియళ్లకు నిలయంగా ఉండేదన్నారు. 70 ఏళ్ల తరువాత అంతకంటే మెరుగ్గా ప్రాజెక్టు వద్ద రూ.5 కోట్లు నిధులతో 2.70 ఎకరాల విస్తీర్ణంలో పర్యాటక అభివృద్ధి పనులు తన హాయంలో జరుగుతుండడం సంతోషంగా ఉందన్నారు. ఈ పనులకు నిధులు సమకూర్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తుడా ఎస్ఈ వరదారెడ్డి, ఈఈ కృష్ణారెడ్డి, అరణియార్ డీఈఈ రత్నారెడ్డి, ఆదినారాయణ నాయుడు, ఏఈఈ మురళీ మోహన్, లోకేశ్వర్ రెడ్డి, కాంట్రాక్టర్ సిద్ధేశ్వర్‌రెడ్డి, నాగలాపురం సింగిల్ విండో చైర్మన్ అపరంజిరాజు, వైఎస్సార్ టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్ఎం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

రేణిగుంట: మండలంలోని కొత్తపాళెం గ్రామంలో రాజ్‌కుమార్ అనే వ్యక్తి అక్రమంగా నిల్వ ఉంచిన 2,620 కిలోల బరువున్న 56 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు విజిలెన్స్ అధికారులు తెలిపారు. నిందితుడు పరారీలు ఉన్నాడు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని గాజులమండ్యం పోలీసులకు అప్పగించారు. సీఎస్ డీటీ తిరుమలేశ్వరి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ధర్మారెడ్డి తెలిపారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,800
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,460

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.72,300
రిటైల్ వెండి గ్రాము	రూ.74.30

అబాండాలు సరికాదు



మాట్లాడుతున్న పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాలహస్తీశ్వరాలయంపై అబాండాలు వేయడం సరికాదని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. ఆలయ పరిపాలనా భవనంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొజ్జల సుధీర్‌రెడ్డి ఆరోపణలను ఖండించారు. తమ ధర్మకర్తలమండలి డమ్మీ కాదన్నారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆలయం నుంచి ఎలాంటి లబ్ధి పొందడం లేదని తెలిపారు. ఒక భక్తుడుగా, దాతగా విరాళాలు అందిస్తున్నారని చెప్పారు. రాజకీయ లబ్ధి కోసం ఆరోపణలు చేయడం భక్తుల మనోభావాలను దెబ్బతీయడమేనన్నారు. ఊరందూరులోని బొజ్జల సుధీర్‌రెడ్డి ఇంటి పక్కనే ఉన్న పురాతన నీలకంఠేశ్వరస్వామి ఆలయాన్ని 30 ఏళ్లుగా టీడీపీ పట్టించుకోలేదని, నేడు రూ.40 లక్షలతో అభివృద్ధి చేసి మహాకుంభాభిషేకం నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఆలయ ఈవో సీసీ హరి షాడో పెత్తనం వ్యవహారంపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళుతామన్నారు. సుధీర్‌రెడ్డి ఆరోపణలపై ఆలయంలో ప్రమాణాని సిద్ధమేనన్నారు. సమావేశంలో పాలకమండలి సభ్యులు మున్నా రాయల్, కొండూరు సునీత, రమాప్రభ, పసల సుమతి, ప్రత్యేక ఆహ్వానితులు నీలా, ప్రముఖులు నంద, భాస్కర్‌ముదిరాజ్, పాలమంగళం రవి, రమణయ్యానాయుడు పాల్గొన్నారు.

13న వాలీబాల్ టోర్నమెంట్

చంద్రగిరి(తిరుపతి రూరల్): దక్షిణ భారతదేశంలో ఈశా ఫౌండేషన్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 15వ గ్రామోత్సవంలో భాగంగా చంద్రగిరి మండలం, నరశింగాపురం గ్రామంలో 13న వాలీబాల్, 26న త్రోబాల్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి ఉమేష్‌శర్మ తెలిపారు. నరశింగాపురం గ్రామంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభ వెలికి తీసేందుకు ఈ టోర్నమెంట్లను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒక పంచాయతీ నుంచి ఎంతమంది క్రీడాకారులైన టోర్నమెంట్‌లో పాల్గొనవచ్చని, ప్రతి జట్టులో ఏడుగురు క్రీడాకారులు మ్యాచ్ ఆడవచ్చని చెప్పారు. క్రీడాకారులకు గుర్తింపు కార్డు తప్పనిసరిగా ఉండాలని, 14 సంవత్సరాలు నిండిన బాలబాలికలు మాత్రమే అర్హులన్నారు. ప్రతి ఒక్కరూ ముందుగానే తమ జట్టు పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. విజేతలకు 200కు పైగా బహుమతులు గెలుచుకోవచ్చునని, పేర్లు నమోదుకు 8300030999లో సంప్రదించాలని కోరారు.

సీఎంఏ ఫలితాల్లో ఎమరాల్డ్స్ విజయకేతనం



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో ఎమరాల్డ్స్ డైరెక్టర్లు

తిరుపతి ఎడ్యుకేషన్ : సీఎంఏ ఫలితాల్లో తిరుపతిలోని ఎమరాల్డ్స్ విద్యాసంస్థ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి విజయకేతనం ఎగురవేశారని ఆ విద్యా సంస్థ డైరెక్టర్లు ఈ.గిరిధర్, కె.విశ్వనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫలితాల్లో ఎస్.అభిజిత్‌కుమార్‌రెడ్డి 356, ఎం.వెంకటయాదవ్ 352, జె.శిరి 342, డి.హేమాద్రి 340, ఎస్ఎం.గాయత్రి 308, ఎస్.జోషితారెడ్డి 302, ఆర్.యశ్వంత్ 300 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఈ పరీక్షకు హాజరైన తమ విద్యార్థుల్లో 86.37 శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను వారు అభినందించారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు



మునిలక్ష్మి (ఫైల్)

ఏర్పేడు: మండలంలోని రాజులకండ్రిగ గ్రామంలో మహిళ అదృశ్యంపై గురువారం ఫిర్యాదు అందినట్టు ఏర్పేడు సీఐ శ్రీహరి తెలిపారు. సీఐ కథనం.. మండలంలోని రాజులకండ్రిగ గ్రామానికి చెందిన చంద్రయ్యశెట్టి పెద్ద కుమార్తె మునిలక్ష్మి (24) రేణిగుంటలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తోంది. ఈ క్రమంలో ఈ నెల 8న కంపెనీకి వెళ్లకుండా ఇంట్లోనే ఉంది. చంద్రయ్యశెట్టి తన భార్యతో కూలి పనులకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి రాగా.. ఇంటి వద్ద పెద్ద కుమార్తె కనిపించకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువతి ఆచూకీ తెలిసిన వారు 9440900729 ఫోన్ నంబర్‌కు సమాచారం అందించాలని సీఐ సూచించారు.

ఉపాధి నైపుణ్యాలపై అవగాహన

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా యూనివర్సిటీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ విద్యార్థులకు ఉపాధి నైపుణ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వాధ్వాని ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ నితన్ బాలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫార్మాస్యూటికల్ కోర్సులో ప్రాథమిక కమ్యూనికేషన్, వర్క్‌ప్లేస్ కమ్యూనికేషన్, ప్రవర్తన నైపుణ్యాలు, డిజిటల్ అక్షరాస్యత, వ్యవస్థాపక మనస్తత్వం, సృజనాత్మక ఆలోచన తదితర నైపుణ్యాలు ఉంటాయన్నారు. దాదాపు 150 మంది విద్యార్థులు ఈ కోర్సు కోసం నమోదు చేసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ షాహీన్ బేగం, ప్రొఫెసర్ బి. శైలజ, అధ్యాపకులు పాల్గొన్నారు.

రెండో ఘాట్ రోడ్డులో ప్రమాదం

తిరుమల : తిరుమల రెండో ఘాట్‌రోడ్డులో ఆర్టీసీ బస్సు అదుపుతప్పి రక్షణ గోడను ఢీకొన్న ఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. రెండో ఘాట్ రోడ్డు మీదుగా తిరుమలకు వస్తున్న ఆర్టీసీ బస్సు రెండో మలుపువద్ద కారును తప్పించబోయి రక్షణగోడను ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న దాదాపు పది మంది భక్తులకు స్వల్పగాయాలయ్యాయి. టీటీడీ ఘాట్ రోడ్డు భద్రతా సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. అనంతరం బస్సును పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

వ్యక్తి ఆత్మహత్య

పెళ్లకూరు: మండలంలోని తాళ్వాయిపాడు గ్రామానికి చెందిన పురిణి బాలకృష్ణయ్య(55) కుటుంబ కలహాలతో గురువారం ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడు. స్థానికుల సమచారం మేరకు.. బాలకృష్ణయ్య మేనకూరు సెజ్‌లోని ఓ పరిశ్రమలో సెక్యూరిటీగార్డుగా పనిచేస్తున్నాడు. గత కొంత కాలంగా మద్యానికి బానిసై కుటుంబ సభ్యులను పట్టించుకోకుండా వ్యవహరించేవాడు. ఈ క్రమంలో బాలకృష్ణయ్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈవిషయంపై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి కల్చరల్: ప్రభుత్వ గ్రాంట్ సహకారంతో తిరుపతి నిర్వహిస్తున్న రాస్ ఏఎన్ఎం, ఎంపీహెచ్‌డబ్ల్యూ శిక్షణ కేంద్రంలో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం ఒక ప్రకటనలో తెలిపారు. రెండేళ్ల కాలపరిమితి గల ఈ కోర్సుల్లో ఇంటర్మీడియట్ విద్యార్హత కలిగిన మహిళా అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. 2023 డిసెంబర్ 31 నాటికి 17–30 ఏళ్ల లోపు వయస్సు కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థినులకు 5 ఏళ్లు సడలింపు ఉంటుందని తెలిపారు. ఇక్కడ చేరిన వారికి ఉచిత విద్య, వసతి లభించడంతో పాటు నెలకు రూ.500 ఉపకారవేతం ఇస్తామన్నారు. చిత్తూరు, అనంతపురం జిల్లాలకు సంబంధించిన అభ్యర్థినులు మాత్రం ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. టెన్త్, ఇంటర్ మార్కుల జాబితా, టీసీ, కుల, స్థానికీకరణతో పాటు నాలుగో తరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, 8 పాస్ పోర్టు సైజ్ ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులు సెప్టంబర్ 30వ తేదీలోపు ది ప్రిన్సిపల్, రాస్ ఎంపీహెచ్‌డబ్ల్యూ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్, కేరాఫ్ రాస్ సేవా నిలయం, ఎయిర్ బైపాస్ రోడ్డు, తిరుపతి–517501 చిరునామాకు పంపాలని పేర్కొన్నారు.

లెర్నింగ్ టూల్స్‌పై అవగాహన పెంచుకోవాలి



వర్క్‌షాప్‌నకు హాజరైన విద్యార్థులతో అధ్యాపకులు

తిరుపతి సిటీ: టీచింగ్ లెర్నింగ్ టూల్స్ ప్రాముఖ్యతపై ట్రైనీ టీచర్స్ అవగాహన పెంచుకోవాలని స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ హ్యూమానిటీస్ అండ్ మేనేజ్‌మెంట్ అధ్యాపకురాలు డాక్టర్ కే అనురాధ సూచించారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో గురువారం హ్యూమానిటీస్ బ్లాక్ సెమినార్ హాల్‌లో టీచింగ్ లెర్నింగ్ టూల్స్ అండ్ పప్పెట్రీ అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ వర్క్‌షాప్ ద్వారా విద్యార్థులు స్వీయ అనుభవంతో నేర్చుకున్న విషయాలు పాఠశాలల్లోని విద్యార్థులకు వారి అవసరాలకు అనుగుణంగా బోధన సామగ్రిని తయారు చేసుకోవడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యావిభాగం అధిపతి ప్రొఫెసర్ టీజీ అముదవల్లి, ప్రొఫెసర్ జీ.సునీత బాయి, పి.రేణుక, డాక్టర్ వీ.మాధవి, డాక్టర్ టీ.శిరీష, డాక్టర్ అనురాధ పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

- రైతు శిక్షణా శిబిరంలో సైంటిస్టుల సూచన
- రెండు తెలుగు రాష్ట్రాల నుంచి హాజరైన రైతులు



రైతులతో అగ్రికల్చరల్ సైంటిస్టులు, జువారీ సంస్థ ప్రతినిధులు

తిరుపతి సిటీ: పంటల అధిక దిగుబడికి భూసార పరీక్షలు తప్పనిసరి అని జువారీ జైకిసాన్ ఫామ్ అబ్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ డాక్టర్ కేకే సింగ్ రైతులకు సూచించారు. గురువారం స్థానిక ఎన్‌జీరంగా వ్యవసాయ కళాశాల ప్రాంగణంలోని సెమినార్ హాల్‌లో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం, జువారీ జైకిసాన్ ఫామ్ అబ్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన రైతులకు రెండు రోజుల శిక్షణా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలలో ఎంపిక చేసిన 50 మంది రైతులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి పొందే ఉపాయాలను రైతులకు వివరిచామని తెలిపారు. అధునాతన సాగు పద్ధతుల పైన, డ్రోన్ స్ప్రే, అధునిక వ్యవసాయ పనిముట్ల వాడం వంటి అంశాలను ప్రధానంగా రైతులకు తెలియజేసినట్టు వెల్లడించారు. అనంతరం రెండు రోజులు శిక్షణ పూర్తి చేసుకున్న రైతులకు ధ్రువీకరణ పత్రాలను అందజేస్తామని తెలిపారు. ఈ శిక్షణా శిబిరంలో వ్యవసాయ పరిశోధాన సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ సీ.రమణ, జువారి అగ్రి డెవెలప్‌మెంట్ ల్యాబ్ డీజీఎం డాక్టర్ బీ.సుధాకర్, సైంటిస్టులు డాక్టర్ కృష్ణారెడ్డి, డాక్టర్ బాలహుస్సేన్‌రెడ్డి పాల్గొన్నారు.

మెలకువలు నేర్చుకున్నాం



ఈ శిక్షణలో తక్కువ పెట్టుబడితో ఎలా అధిక దిగుబడిని సాధించాలనే విషయాన్ని తెలుసుకున్నాం. డ్రోన్ స్ప్రే సిస్టమ్ అవశ్యకత, నూతన వ్యవసాయ పనిముట్ల వాడకంపై శిక్షణ ఇచ్చారు. ఉత్తమ ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నాం. – శంకరరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నిజామాబాద్, తెలంగాణ

మందుల పిచికారీపై అవగాహన



శిక్షణ చాలా ఉపయోగకరంగా ఉంది. పంట సాగుకు ముందు భూమిని ఎలా సారవంతంగా ఉంచుకోవాలి, మందుల పిచకారీ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అధునాతన వ్యవసాయ పనిముట్లపై శిక్షణ ఇచ్చారు.

– ఎంవీ.సుబ్బారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మైదుకూరు, వైఎస్సార్ కడప జిల్లా

భూసారాన్ని బట్టే పంట సాగు



భూసార పరీక్షలపై పూర్తి అవగాహన లేకుండా ఉండేది. ప్రస్తుతం రైతు శిక్షణలో అధికారులు, సైంటిస్టులు మట్టి పరీక్షల అవశ్యకతను తెలయజేశారు. దీంతో సారాన్ని బట్టి ఏ పంట ఏ సీజన్‌లో వేయాలనే అంశాలు అర్థమయ్యాయి.

– చంద్రశేఖర్‌గౌడ్, మధు కిషోర్, పశ్చిమగోదావరి